# ఇంటర్వ్యూ గదిలో... ఇలా!

ఉద్యోగానికి మీరు సరిపోతారా లేదా అనే విషయాన్ని వ్యక్తిగతంగా మీతోనే మాట్లాడటం ద్వారా కంపెనీలు తెలుసుకోవాలనుకుంటాయి. అందుకే ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి. ఇంటర్వ్యూ గదిలోకి ప్రవేశించడం దగ్గర్నుంచి, అక్కడి సమన్వయకర్తలతో మాట్లాడటం, ఇతర వ్యక్తులను పరిచయం చేసుకోవడం... ఇలాంటి అన్ని అంశాలను కంపెనీలు నిశితంగా పరిశీలిస్తాయి. ఇంటర్వ్యూ దశ వరకు మిమ్మల్ని తీసుకురావడానికి కంపెనీలు మీకంటే ఎక్కువ సమయం వెచ్చించి ఉంటాయి. అందువల్ల కంపెనీలు అంత తేలిగ్గా మంచి అభ్యర్థులను వదులుకోలేవు.



జి.ఆర్.రెడ్డి
ఎం.డి., Husys

**కార్పొరేట్ నియామక పరీక్షల్లో చివరి అంకం... ఇంటర్వ్యూ. ఈ దశలో సబ్జెక్టు, తెలివితేటలే కాదు... మీ మాటతీరు, ప్రవర్తన, భాష, వేషధారణ... అన్నీ పరీక్షకు గురవుతాయి. ఇంటర్వ్యూ హాల్లో వెచ్చించే కొద్ది నిమిషాల వ్యవధిలోనే మీ మొదటి ఉద్యోగం కలలు నెరవేరుతాయా, లేదా అనేది తెలిసిపోతుంది. చేసే ప్రతి పనిలోనూ, వేసే ప్రతి అడుగులోనూ జాగ్రత్తగా ఉంటేనే అంతిమ విజయం సాధ్యమవుతుంది.**

## 80 శాతం మీ గురించే...

ఇంటర్వ్యూలో సాధారణంగా 80 శాతం అంశాలు మీ చుట్టూనే తిరుగుతాయి. మీ సామర్థ్యాలను కంపెనీకి తెలియజేయడానికి ఇది చక్కని అవకాశం. ఇంటర్వ్యూలో మీరు చెప్పిన అంశాల ఆధారంగా, కంపెనీలో మీ ఉద్యోగాన్ని, పాత్రను సభ్యులు అంచనా వేస్తారు. ఇంటర్వ్యూలో మీరు కాకుండా బోర్డు సభ్యులు ఎక్కువగా మాట్లాడుతున్నట్టయితే... ఏదో తేడా ఉన్నట్టే! అందువల్ల చాలా సందర్భాల్లో అభ్యర్థులు అవసరమైన దానికంటే ఎక్కువ మాట్లాడినా నష్టమే! ఇంటర్వ్యూలో మిగిలిన 20 శాతం సమయం... బోర్డు సభ్యులు చెప్పేదాన్ని వినడం, అర్థం చేసుకోవడం, తిరిగి స్పందించడానికి సరిపోతుంది. ఏదైనా అర్థం కాకపోతే సభ్యులను మళ్లీమళ్లీ చెప్పమని అడగకూడదు. 20 నిమిషాల ఇంటర్వ్యూలో ఒక్కసారి ఇలా అడగవచ్చు.

## ప్రతిక్షణం... సానుకూలం

ఇంటర్వ్యూ కోసం కంపెనీ పరిసరాల్లోకి వెళ్లినప్పుడు, అక్కడ మీరు వేసే ప్రతి అడుగు, పని మీపై కంపెనీకి ఒక అభిప్రాయాన్ని ఏర్పరుస్తాయి. ప్రతి మాట, ప్రవర్తన మీ వ్యక్తిత్వానికి కొలబద్దగా మారతాయి. అన్ని దశల్లోనూ నిజమైన, సహజసిద్ధమైన, సానుకూల స్వభావం వ్యక్తపరచాలి. మీపై కంపెనీకి సదభిప్రాయం ఏర్పడటానికి ఇవన్నీ ఉపకరిస్తాయి.

ఇటీవలి కాలంలో టెలిఫోనిక్ ఇంటర్వ్యూలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి ఇంటర్వ్యూల్లో అభ్యర్థికి కమ్యూనికేషన్, ఇంటరాక్టివ్ సామర్థ్యాలు చాలా ముఖ్యం. ఈ ఇంటర్వ్యూలో పాల్గొనేటప్పుడు ఫోన్‌లో మాట్లాడటానికి అనువైన ప్రదేశంలో ఉండాలి. మరీ అత్యవసరం అయితే తప్ప ఇంటర్వ్యూను వాయిదా వేయకూడదు. ఇంటర్వ్యూకు ముందే సెల్‌ఫోన్‌కు చార్జింగ్ సరిగా ఉందీ లేనిదీ చెక్ చేసుకోవాలి.

వ్యక్తిగత ఇంటర్వ్యూలలో సాధారణంగా హెచ్.ఆర్., టెక్నికల్ దశలుంటాయి. ఈ రెండూ కంపెనీ అవసరాన్ని బట్టి విడివిడిగా లేదా ఒకేసారి నిర్వహించవచ్చు. హెచ్.ఆర్. దశలో మీ వ్యక్తిగత సమాచారం, పెరిగిన వాతావరణం, అర్హతలు, లక్ష్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం, ప్రత్యేక ఆసక్తులు, టీమ్ స్వభావం, ఆశిస్తున్న వేతనం, తదితర అంశాల గురించి తెలుసుకుంటారు. టెక్నికల్ దశలో... మీ చదువు, సామర్థ్యాలు, తెలివితేటలు కంపెనీకి ఏ మేరకు ఉపయోగపడతాయో అంచనా వేస్తారు.

## విజయంపై ప్రభావం

ఇంటర్వ్యూలలో ముఖ్యంగా మీ కమ్యూనికేషన్, బాడీ లాంగ్వేజ్, అనుకోకుండా బయటపడే అలవాట్లు ఉద్యోగావకాశాలను చాలా ప్రభావితం చేస్తాయి.

✦ ఇంటర్వ్యూలో మీ మాటలు, సరైన సమయంలో సరైన సమాచారం, సమాధానాల్లో వేగం, సహజమైన భాష, వ్యక్తీకరణ... ఇవన్నీ 50 శాతం విజయాన్ని నిర్ణయిస్తాయి.

✦ మీ బాడీ లాంగ్వేజ్ విజయంపై 40 శాతం ప్రభావాన్ని చూపిస్తుంది. కూర్చునే విధానం, బాడీ ద్వారా వచ్చే సంజ్ఞలు, వేసుకున్న దుస్తులు... ఇవన్నీ ముఖ్యమే.

✦ చాలా సందర్భాల్లో మీకు తెలియకుండా కొన్ని మాటలు వాటంతటవే వస్తుంటాయి. ఈ మాటలు మీ విజయావకాశాలపై 10 శాతం ప్రభావం చూపిస్తాయి. కొంతమందికి తరచూ 'No' అనటం అలవాటు. కొందరు సమాధానం చెప్పబోయే ముందు 'ఫ్' అనీ, 'హ్మc' లేదా 'ఆఆc' అనీ అంటుంటారు. ఇంటర్వ్యూలో ఇలాంటివి వ్యక్తం చేయకుండా జాగ్రత్తపడాలి. సందర్భాన్ని బట్టి Yes, I understand, I am positive, Correct లాంటి మాటలు వాడొచ్చు.

## ఏ దశలో ఏం చేయాలి?

ఇంటర్వ్యూ సుమారు 20 నిమిషాలు ఉంటుందనుకుందాం. అందులో ప్రారంభం నుంచి వివిధ దశల్లో రకరకాల అంశాలను పరీక్షిస్తారు.

✦ **0–60 సెకన్లు:** ఇంటర్వ్యూ ఆహ్లాదకరంగా కొనసాగడానికి ఈ సమయంలోనే పునాది పడుతుంది. మీరు సాధించిన విజయాలు, కంపెనీకి ఉపయోగకరమైన, ఆసక్తికరంగా ఉండే అంశాలు ప్రస్తావించాలి. ఇంటర్వ్యూ ప్రారంభంలో సహజంగా షేక్ హ్యాండ్‌లు, కుర్చీ తీసుకోవడం, కూర్చోవడం లాంటి చర్యల ద్వారా అభ్యర్థి ఉత్సాహాన్ని పరీక్షిస్తారు. ఇవన్నీ బోర్డు సభ్యులు సంతృప్తికరంగా తర్వాత దశకు దృష్టి మరల్చే విధంగా ఉండాలి.

✦ **1–3 నిమిషాలు:** సాధారణంగా మీ గురించి తెలియజేయాల్సి వస్తుంది. నిర్దిష్టంగా మీ సామర్థ్యాలను, ముఖ్యమైన అంశాలను చెప్పాలి. వీటిపైనే తర్వాత ప్రశ్నలుంటాయని మర్చిపోవద్దు.

✦ **3–15 నిమిషాలు:** మీ తెలివితేటలు ఏమిటి? కంపెనీకి అవి ఎలా సరిపోతాయనేది తెలుసుకోవడానికి కేటాయించే సమయం ఇదే. కంపెనీ ముందుగానే నిర్దేశించుకున్న ప్రమాణాలకు మీ సామర్థ్యాలు ఏ విధంగా సరిపోతాయో పరీక్షిస్తారు.

✦ **1–2 నిమిషాలు:** ఇంటర్వ్యూ ముగింపు సమయం. బోర్డు సభ్యులు మిమ్మల్ని ఏమైనా ప్రశ్నలడగమనొచ్చు. మొత్తం ఇంటర్వ్యూను సరైన ముగింపునకు తీసుకురావడానికి ప్రయత్నించాలి. ఫలితాలు ఎప్పుడు రావచ్చు? లాంటి అంశాలను ప్రస్తావించవచ్చు.

## సహజంగా ఉంటేనే మేలు!

✦ ఇంటర్వ్యూ ప్రదేశంలో వీలైనంతవరకు ఆహ్లాదకర ధోరణితో, సహజంగా ఉండటానికి ప్రయత్నించాలి. మంచి దుస్తులు, కూర్చోవడం, చేతులు పెట్టుకోవడం, ఇంటర్వ్యూ బోర్డును గౌరవించడం, సభ్యులు మాట్లాడేటప్పుడు సరిగా వినడం, నిర్దిష్ట సమాధానాలు... ఇవన్నీ ఇంటర్వ్యూలో అత్యంత కీలకమైన అంశాలు.

✦ మీ సమయం వచ్చే వరకు ఓపిగ్గా వేచి చూడాలి. అసహనం ప్రదర్శించవద్దు. మీ ప్రవర్తనను ఎవరైనా పరిశీలిస్తుండవచ్చు.

✦ ఇంటర్వ్యూ గదిలోకి ప్రవేశించగానే బోర్డు సభ్యులను పలకరించడం మర్చిపోవద్దు.

✦ మీరు మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా సభ్యుడు మిమ్మల్ని తర్వాత ప్రశ్న అడగటానికి ప్రయత్నిస్తున్నారేమో చూడండి. మీ సమాధానం ముగియగానే ఆ సభ్యుడి వైపు చూడాలి.

✦ ఇంటర్వ్యూకు వచ్చిన ఇతర అభ్యర్థులతో మాట్లాడండి. దీనివల్ల మీ బలాబలాలు మీకు తెలుస్తాయి. ఇతరులతో పోలిస్తే మీకు బాగా కలిసొచ్చే, పట్టున్న అంశాలను ఇంటర్వ్యూలో ఎక్కువగా ప్రస్తావించండి.

✦ ఏదైనా ప్రశ్నకు సమాధానం తెలియకపోతే... ఏదో ఒకటి చెప్పేదానికంటే తెలియదని ఒప్పుకోవడం చాలా మంచిది.

✦ కొన్నిసార్లు మీ సామర్థ్యాలు/ ఏదైనా పనిలో ప్రావీణ్యం గురించి 1-10 లేదా 1-5 మధ్య రేటింగ్ ఇవ్వమని అడగొచ్చు. ఇలాంటి సందర్భాల్లో ముందుగా '1' ఎక్కువను సూచిస్తుందో, తక్కువను సూచిస్తుందో స్పష్టంగా తెలుసుకోవాలి. దాన్ని బట్టి రేటింగ్ చెప్పాలి.

✦ సౌకర్యవంతంగా ఉండే దుస్తులు వేసుకోవాలి.

✦ ప్రశ్న ఎవరడిగినా సమాధానం చెప్పేటప్పుడు బోర్డులోని సభ్యులందరివైపు చూస్తుండాలి.

✦ మాట్లాడేటప్పుడు సహజంగా ప్రవర్తనలో బయటపడే లోపాలేమైనా సవరించుకోవాలి. మిమ్మల్ని బాగా పరిశీలించే స్నేహితులకు ఇవి తెలుస్తాయి.

✦ వంద శాతం కచ్చితమైన సమాధానం తెలిస్తే మంచిదే. తెలియకపోతే కంగారు పడాల్సిందేమీ లేదు. కంపెనీలు కూడా మొదట్లోనే అత్యంత ప్రతిభావంతులు, పరిపూర్ణులైన అభ్యర్థుల కోసం వెతకవు. కంపెనీ అవసరాలకు సరిపోయే విధంగా మీ సామర్థ్యాలుంటే చాలు.

✦ ఇంటర్వ్యూ సరైన దారిలోనే వెళ్లేలా చూడాల్సిన బాధ్యత కూడా అభ్యర్థిదే. మీరు తప్పులు చేస్తే, ఇంటర్వ్యూ పక్కదారి పడుతుంది. అందువల్ల సమాధానాల్లో, ప్రవర్తనలో తప్పులను నివారించాలి.

✦ ఇంటర్వ్యూకు ముందే... మీరు ఈ దశకు చేరుకోవడానికి చేసిన ప్రయత్నాలను గుర్తించాలి. ఏ అంశాల్లో ఇంకా మెరుగ్గా చేసుండాల్సిందీ తెలుసుకోండి. మీ అనుభవానికి సంబంధించిన ప్రశ్నలను ఎదుర్కోవడానికి ఈ సంసిద్ధత ఉపయోగపడుతుంది.

## సరిగా చేయకపోతే ...



ఇంటర్వ్యూకు హాజరవ్వబోయే ప్రతి అభ్యర్థీ ముందుగా ఆ రంగంలో ఎంతో కొంత అనుభవం ఉన్నవారిని సంప్రదించడం చాలా మంచిది. దీనివల్ల చాలా సందేహాలు నివృతి అవుతాయి. తర్వాత అభ్యర్థికి సానుకూల ఆలోచన దృక్పథం ఉండాలి. ఈ ఉద్యోగం నాకు వస్తుందో, రాదో అనుకోకుండా ఎల్లప్పుడూ ఆశావహంగా ఉండాలి.

★ ఇంటర్వ్యూ సమయంలో బోర్డులోని సభ్యులవైపే చూస్తూ మాట్లాడాలి. తద్వారా వేరే విషయాలపైకి దృష్టి మరల్చకుండా ఉండవచ్చు. బోర్డు సభ్యుల దృష్టిని ఆకర్షించవచ్చు.

★ ఒత్తిడి, ఆందోళనకు గురికావద్దు. ఒక్కసారి ఇంటర్వ్యూలో కంగారు మొదలైందంటే, ఆలోచన ఆగిపోతుంది. సభ్యులు ఏమి అడుగుతున్నారో, మీరేమి చెబుతున్నారో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది.

★ అభ్యర్థిలో బాగా ఆత్మవిశ్వాసం కనబడాలి. దీనివల్ల ప్రశ్నలడిగే వాళ్లు కూడా సౌకర్యవంతంగా ఫీలవుతారు.

★ ఇంటర్వ్యూ సరిగా చేయలేదని మీకు అనిపించినట్లయితే, నిరాశ చెందవద్దు. అదే చివరిఇంటర్వ్యూ కాదు. అనుభవం ఉన్నవారితో చర్చించి ఎక్కడ లోపం ఉందో తెలుసుకోండి. ఈ వైఫల్యాన్ని నేర్చుకోవడానికి ఒక మంచి అవకాశంగా భావించండి. సానుకూల దృక్పథంతో ఆలోచించి ముందుకుసాగితే మరోసారి విజయం సాధించవచ్చు.

- **లక్ష్మీ రమేష్,** హెచ్.ఆర్. జనరలిస్ట్, డెల్ ఇంటర్నేషనల్ సర్వీసెస్

### ఆ రెండు లక్షణాలే...

నేను ఇంటర్వ్యూలో విజయం సాధించడానికి దోహదపడిన ముఖ్యమైన అంశాలు... మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మవిశ్వాసం. ఇంట్లోవారితో, స్నేహితులతో వీలైనంత ఎక్కువగా మాట్లాడుతుంటే కమ్యూనికేషన్ సామర్థ్యాలు పెరుగుతాయి, తద్వారా ఆత్మవిశ్వాసం పెంచుకోవచ్చు.

- **ఏర్పుల కిరణ్‌కుమార్,** సత్యం కంప్యూటర్ సర్వీసెస్

### ప్రాథమిక అంశాల గురించి...

ఇంజినీరింగ్ మూడో సంవత్సరం నుంచే నేను క్యాంపస్ ఇంటర్వ్యూపై దృష్టిపెట్టాను. రాతపరీక్ష కోసం ప్రత్యేకంగా పెద్దగా ప్రిపేర్ కాలేదు. ఆర్.ఎస్. అగర్వాల్, శకుంతలాదేవి పుస్తకాలు బాగా ఉపయోగపడ్డాయి. పర్సనల్ ఇంటర్వ్యూలో నేను స్కూలు దశ నుంచి చదివిన సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాల గురించి అడిగారు. మంచి కమ్యూనికేషన్, సానుకూల ధోరణి, ఇంటర్వ్యూ చివరి వరకు స్థిరత్వం ప్రదర్శించడం ద్వారా ఇంటర్వ్యూలో నెగ్గాను.

- **భవాని రాఘవాపురం,** కాగ్నిజెంట్ టెక్నాలజీ సర్వీసెస్

### నిజాయతీ ముఖ్యం!

చాలా ఇంటర్వ్యూల్లో విఫలమయ్యాను. ఆ అనుభవం నుంచి బాగా నేర్చుకున్నాను. రెస్యూమె దగ్గర్నుంచి హెచ్.ఆర్. దశ వరకు జాగ్రత్తలు తీసుకున్నాను. ఇంటర్వ్యూలో నిజాయతీ చాలా ముఖ్యం. అన్ని రకాలుగా బాగా సిద్ధమైతే ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది.

- **ఎస్. రాకేష్,** సత్యం కంప్యూటర్ సర్వీసెస్